సాక్షి
అనంతపురం
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.19 పలికింది. కనిష్టం రూ.10 క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/21.9°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈనెల 6న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీ పరిష్కార స్థితి ఏ దశలో ఉందనే విషయాన్ని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను పరిష్కార వేదిక ద్వారానే కాకుండా meekoram.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


కురుబ పోతన్న (ఫైల్)

బెళుగుప్ప: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని యలగల వంక గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన మేరకు.. యలగలవంకకు చెందిన కురుబ పోతన్న (71) తన ఏడు ఎకరాల్లో బోర్లు వేయించేందుకు, పంటల సాగుకు సుమారు రూ.25 లక్షల అప్పు చేశాడు. కొన్ని సంవత్సరాలుగా పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పోతన్న శనివారం విషపు గుళికలు మింగాడు. గుర్తించిన భార్య పార్వతమ్మ చుట్టుపక్కలవారి సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అయితే, చికిత్స ఫలించక పోతన్న మృతి చెందాడు. పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ పేర్కొన్నారు.

ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవాలి

- అగ్నిమాపకశాఖ డీజీ వెంకటరమణ


మాట్లాడుతున్న డీజీ వెంకట రమణ

అనంతపురం: ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) పి. వెంకటరమణ అన్నారు. శనివారం జేఎన్‌టీయూ(ఏ) ఆడిటోరియంలో జోన్‌-4 పరిధిలోని శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన అగ్నిమాపక శాఖ అధికారులు, సహాయ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి జిల్లాలోని అగ్నిమాపక సదుపాయాల స్థితిగతులపై ఆరా తీశారు. అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది బలోపేతం, కొత్త సాంకేతిక పరికరాల అవసరంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విపత్తు నిర్వహణలో వేగవంతమైన ప్రతిస్పందన వ్యవస్థను అభివృద్ధి పరిచేలా సూచనలు ఇచ్చారు. ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి (జోన్‌-4) ఎం. భూపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లపై జీఎస్టీ తగ్గింపు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలపై 12 శాతం ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం 5 శాతానికి తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెక్టారుకు రూ.4,450 వరకు రైతులకు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే మంజూరై మెటీరియల్ పంపిణీ కాని, అలాగే రైతు వాటా చెల్లించి, పరికరాలు మంజూరు కాని వారు గత నెల 22 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ తగ్గింపు మేరకు మొత్తం 1,408 మంది రైతులకు రూ.67.63 లక్షల మేరకు తిరిగి వెనక్కి చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు 18 వేల హెక్టార్ల లక్ష్యం ఉన్నందున 2018–19 కన్నా ముందు డ్రిప్, స్ప్రింక్లర్లు పొందిన రైతులు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

జడలు విప్పిన జూదం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల పరిధిలోని మైలారంపల్లి వద్ద వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరం నడుస్తున్నట్లు పోలీసులకు ఇటీవల సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి 21 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.77 వేల నగదు, 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- తాడిపత్రిలో సెప్టెంబర్ 29న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. మూడు చోట్ల 21 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ రెండు చోట్లే కాదు.. జిల్లా వ్యాప్తంగా పేకాట యథేచ్ఛగా సాగుతోంది. 'తెలుగు తమ్ముళ్ల హస్తం' ఉండడంతో పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.



- ఊరూరా అనధికారిక పేకాట క్లబ్బులు
- జేబులు నింపుకుంటున్న 'తమ్ముళ్లు'
- నగరాలు, పట్టణాలు, పల్లెల్లో యథేచ్ఛగా దందా
- మంత్రి పయ్యావుల ఇలాకాలో జోరుగా పేకాట
- ఆటగాళ్లకు సకల సౌకర్యాలు.. అవసరానికి అక్కడికక్కడే అప్పులు

అనంతపురం/ తాడిపత్రి టౌన్: జిల్లాలో 'మూడు ముక్కలు, ఆరు ఆటలు' అన్న చందాన పేకాట దందా సాగుతోంది. పేకాట క్లబ్బుల ద్వారా రోజూ అధికార పార్టీ నేతలు రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో విపరీతంగా పేకాట నిర్వహిస్తున్నారు. కూడేరు మండలంలో పేకాటరాయుళ్లకు అంతే లేకుండా పోయింది. తాడిపత్రి పట్టణంలో గత సోమవారం ఒక్క రోజే మూడు పేకాట స్థావరాలపై దాడి చేసి 21 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక.. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్లలో పట్టపగలే యథేచ్ఛగా పేకాట ఆడుతున్నా పట్టించుకునే వారే లేరు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు మండలాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో అటవీ ప్రాంతాల్లోనూ పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఇక్కడికి కర్ణాటక నుంచి సైతం పేకాటరాయుళ్లు భారీగా వస్తున్నారు. ఒక్కో స్థావరం నుంచి రోజుకు రూ.3 లక్షల చొప్పున కమీషన్ రూపంలో వెళ్తోంది. రూ.లక్షకు రూ.2 వేల చొప్పున కమీషన్ తీసుకుంటూ అప్పుగా ఇస్తున్న వారు కూడా పెరిగిపోయారు. ప్రతి జూద కేంద్రం నుంచి 20 శాతం టీడీపీ నాయకులు కమీషన్ తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మట్కా, పేకాట హబ్‌గా తాడిపత్రి

కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి ప్రాంతం మట్కా, పేకాటకు హబ్‌గా మారింది. పట్టణ శివారు ప్రాంతాల్లో పేకాట కేంద్రాలు నడుస్తుండగా.. పట్టణ ప్రధాన కూడళ్లు, పలు కాలనీలు మట్కా కేంద్రాలకు కేరాఫ్‌గా మారాయి. నిర్వాహకులు అధికారపార్టీ నాయకులు కావడంతో పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోతున్నారు. నేరుగా ఏఎస్పీకి సమాచారం వస్తేగానీ మట్కా, పేకాట నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ఓ అధికారపార్టీ నాయకుడికి పేకముక్క ముట్టనిదే తెల్లవారదు. నిత్యం తన నివాసంలోనే పేకాట కేంద్రాన్ని నడుపుతున్నాడు. పోలీసులందరికీ ఈ విషయం తెలిసినా ఆయన ఇచ్చే మామూళ్లతో మిన్నకుండిపోతున్నారు. రెండు నెలల క్రితం ఎస్పీకి సమాచారం రావడంతో.. సదరు నాయకుడి ఇంట్లో పేకాటరాయుళ్లను ఎస్పీ టీం అరెస్ట్ చేసింది. అరెస్ట్ అయిన వారిలో ఆ అధికార పార్టీ నాయకుడు ఉన్నాడు. అయితే పోలీసులు ఆయన పేరు బయటకు రాకుండా, జూదరుల పేర్లు చెప్పకుండా స్వామి భక్తి ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. పెన్నానది శివారు తోటలు, నిలిచిన నాపరాళ్ల ఫ్యాక్టరీలు పేకాట కేంద్రాలుగా మారుతున్నాయి.
- తాడిపత్రిలో ఏ వీధిలో చూసినా మట్కా బీటర్లు హల్‌చల్ చేస్తున్నారు. సాయంత్రమైతే చాలు రోడ్లపైనే మట్కా చీటీలు రాస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా 10 మంది చేతిలో మట్కా వ్యాపారం సాగుతోంది. ఆర్టీసీ బస్టాండ్, చాంద్ టాకీస్, నందలపాడు, శ్రీనివాస పురం, విజయనగర్‌కాలనీ, గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో మట్కా పెద్ద ఎత్తున సాగుతోంది. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పక్కనే నివాసంలో ఓ మహిళ మట్కా బీటర్‌గా అవతారమెత్తినా పోలీసులు ఆవైపు చూడటం లేదు. ముఖ్యంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపైనే బీటర్లు మట్కా సాగిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందిస్తే గానీ తాడిపత్రిలో జూదకేంద్రాలను నిలువరించలేరని ప్రజలు వాపోతున్నారు.

రండి బాబూ రండి..

పేకాట ఆడేవాళ్లను బ్రోకర్లు ఎక్కడికక్కడ ఆహ్వానిస్తున్నారు. 'అనువైన చోటు, తిండి తిప్పల బాధ్యత మాదే. ముక్కలూ మావే.. మీరు డబ్బు తెచ్చుకుంటే చాలు.. అదీ కష్టం అనుకుంటే ఫోన్ పే/ గూగుల్ పే అయినా ఓకే' అంటూ ఎర వేస్తున్నారు. 'మీ భద్రతకు మాది పూచి.. మీకు ఏం కావాలన్నా తెచ్చి పెట్టడానికి చేతికింద ఎంతో మంది 'జాకీ'లూ సిద్ధం.. పైన 'కింగ్' మనోడే.. ఇంకెందుకు ఆలోచిస్తారు' అంటూ అభయమిస్తున్నట్లు తెలిసింది.

తేనెటీగల దాడిలో రెవెన్యూ ఉద్యోగులకు గాయాలు



తేనెటీగల దాడితో వీఆర్‌ఓ ఛత్రేనాయక్ చెవి, చేతికి వాపు వచ్చిన దృశ్యం

వజ్రకరూరు: రాగులపాడు సమీపంలోని హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్ద శనివారం సాయంత్రం రెవెన్యూ ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేశాయి. పలువురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొనకొండ్ల గ్రామానికి చెందిన ఎం.రామాంజినేయులు అనే వ్యవసాయ కూలీ నాలుగు రోజుల క్రితం ఛాయాపురం వద్ద ఉన్న హంద్రీ-నీవా ప్రధాన కాలువలో గల్లంతయ్యాడు. ఇప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, వజ్రకరూరు పోలీసులు గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం వజ్రకరూరు తహసీల్దార్ నరేష్‌కుమార్ నేతృత్వంలో ఆర్ఐ సతీష్‌కుమార్, వీఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్ఏలు విజయ్, పెన్నయ్య, సుంకన్నతో పాటు మరికొందరు రెవెన్యూ ఉద్యోగులు ఛాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకు కాలువ వెంట గాలించారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అకస్మాత్తుగా తేనెటీగలు దాడిచేశాయి. వీఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్ఏలు విజయ్, పెన్నయ్య, సుంకన్న తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే వజ్రకరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- ఎస్పీ జగదీష్

రాప్తాడు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసులు, చోరీలు, రికవరీలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై ఆరా తీశారు. చోరీ కేసుల్లో రికవరీలు పెరగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర పోషించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలపై చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెళ్లి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిరంతర నిఘా ఉంచి, గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

సమర్థవంతమైన సేవలందించాలి

శింగనమల (నార్పల): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించాలని ఎస్పీ జగదీష్ సిబ్బందికి సూచించారు. శనివారం నార్పల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో పరిస్థితులు, కేసుల వివరాలను సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు తనిఖీ చేయండి

అనంతపురం కార్పొరేషన్: డెంగీ నిర్ధారణకు సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లను తనిఖీ చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారులను డీఐఓ ఓబులు ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. డెంగీ పాజిటివ్‌గా నివేదిక వచ్చినప్పుడు సదరు ఆస్పత్రి, ల్యాబ్‌లు ఏ పరికరం ద్వారా పరీక్ష చేస్తున్నారు.. అందుకు సంబంధించి వివరాలను ఆరోగ్యశాఖ ప్రతిపాదించిన ఫార్మాట్‌లో నమోదు చేయాలన్నారు. ఎలీసా రీడర్ ద్వారా డెంగీ నిర్ధారణ జరిగితే కేసు నమోదైన ప్రాంతంలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు గిరిధర్‌రెడ్డి, రమేష్ బత్తుల, రామకృష్ణయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమాయకుల ప్రాణాలతో ఆటలు

- ఈ ఏడాది ఆగస్టు 3న బుక్కరాయసముద్రం మండలం చదళ్ల గ్రామానికి చెందిన రాధమ్మ (29)కు గైనకాలజిస్టు చేయాల్సిన గర్భసంచి ఆపరేషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా సర్వజనాస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణానాయక్ చేశాడు. చివరకు ఆపరేషన్ జరిగే సమయంలో తీవ్ర రక్తస్రావంతో శ్రీకృప ఆస్పత్రిలోనే రాధమ్మ మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు, భర్త కన్నీరుమున్నీరయ్యారు.
- గత నెల 21న ధర్మవరానికి చెందిన పార్వతి(39) కిమ్స్ –సవీర ఆస్పత్రిలో మృతి చెందింది. రూ.2 లక్షల వరకు బిల్లు అయ్యిందని, కిమ్స్–సవీర వైద్యుల నిర్లక్ష్యంతోనే తన అత్త మృతి చెందిందని మృతురాలి కోడలు గాయత్రి, బంధువులు ఆరోపించడం, ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడం చర్చనీయాంశమైంది.
- గత నెల మొదటి వారంలో నగరంలోని సీఎంఎస్ ఆస్పత్రిలో ఓ యువతికి అబార్షన్ అయ్యింది. అయితే, చికిత్స వికటించడంతో యువతి మృతి చెందింది. దీంతో సీఎంఎస్ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ సీజ్ చేశారు.... జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న ఇలాంటి ఘటనలు ప్రజలను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రజలు వణికిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం

- ధనార్జనే ధ్యేయంగా రెచ్చిపోతున్న వైనం
- చోద్యం చూస్తున్న ఆరోగ్యశాఖ
- కలెక్టర్ స్పందిస్తేనే పేదలకు మేలు

అనంతపురం మెడికల్: 'వైద్యో నారాయణో హరి' అన్న ఆర్యోక్తికి అర్థం లేకుండా చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా రెచ్చిపోతున్నారు. అందినకాడికి దోచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా శస్త్రచికిత్సలు, వైద్యం చేయడం.. అవి వికటించాక కార్డియాక్ అరెస్టు అంటూ చేతులెత్తేయడం కొందరు వైద్యులకు షరా మామూలుగా మారిపోయింది. రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తూ పేద ప్రజల జేబులు చిల్లులు చేయడమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.


ఈ ఏడాది ఆగస్టు 3న శ్రీ కృప ఆస్పత్రిలో మృతి చెందిన రాధమ్మ (ఫైల్)

నిత్యం ఎక్కడో ఓ చోట..


డాక్టర్ల నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఘటనలు జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట వెలుగులోకి వస్తుండడం గమనార్హం. ఇటీవల కూడేరు మండలం హంసాయనపల్లికి చెందిన రాధ అనే మహిళకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్ చేసిన శస్త్రచికిత్స వికటించింది. యూరిన్ రాని పరిస్థితి తలెత్తడంతో బాధితురాలు ఇప్పటికీ ప్రత్యక్ష నరకం చూస్తోంది. ఇక.. ఈ నెల 20న అనంతపురంలోని 'అమ్మ' ఆస్పత్రిలో శిరీష అనే మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ ఆరోగ్యం క్షీణించడంతో 'హృదయ' ఆస్పత్రిలో చూపించారు. అందుకోసం రూ.4 లక్షలకు పైగా ఖర్చయ్యింది. అయినా, బిడ్డ చనిపోవడంతో కోపోద్రిక్తులైన కుటుంబీకులు 'అమ్మ' ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైద్యురాలు నిర్లక్ష్యంతో సకాలంలో ప్రసవం చేయలేదని ఆరోపించడం చర్చకు దారి తీసింది.

ఆరోగ్యశాఖ అండతోనే..

నగరంలో రామ్‌నగర్, సాయినగర్, ఖాజానగర్, విద్యుత్‌నగర్, మారుతీనగర్, ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఆస్పత్రులు వెలిశాయి. ఇక్కడి చాలా ఆస్పత్రుల్లో నిర్వాహకులు ధనదాహంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతోనే 'ఆడిందే ఆట పాడిందే పాట' అన్న చందంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కళ్ల ముందు రోగుల ప్రాణాలు పోతున్నా కేవలం మెమోలు జారీ చేయడం తూతూ మంత్రంగా విచారణకు ఆదేశించి చేతులు దులుపుకోవడంపై సామాన్యులు మండిపడుతున్నారు. సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసే వారినే కమిటీ సభ్యులుగా నియమిస్తే వాస్తవాలు ఎలా వెలుగులోకి వస్తాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు కొంతైనా న్యాయం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కేశవన్నా.. పప్పుశనగ ఇంకెప్పుడన్నా?

- ఆర్థిక మంత్రి ఇలాకాలోనే విత్తనానికి నిధులు ఇవ్వకుండా దాటవేత
- గత ఖరీఫ్, రబీకి సంబంధించి ఏజెన్సీలకు రూ.74 కోట్ల బకాయిలు



అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్‌లో కీలక మంత్రి పయ్యావుల కేశవ్ సొంత జిల్లాలోనే రైతులు విత్తనాలు, ఎరువుల కోసం నానా పాట్లు పడుతున్నారు. ఖరీఫ్‌లో ఆలస్యంగా విత్తన వేరుశనగ పంపిణీ చేయడంతో రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. కనీసం పంపిణీ చేసిన విత్తనానికి సంబంధించి రాయితీ సొమ్మును ఏజెన్సీలకు కూటమి ప్రభుత్వం ఇవ్వలేదు. గత ఖరీఫ్, రబీతో పాటు ఈ ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, పప్పుశనగకు సంబంధించి ఏజెన్సీలకు రూ.74 కోట్ల బకాయిలు పెట్టడంతో ఏజెన్సీల నిర్వాహకులు విత్తన సరఫరాకు ముందుకు రావడం లేదు. దీంతో రబీలో పప్పుశనగ రాక ఆలస్యమవుతోంది. సీజన్ ప్రారంభమై నాలుగైదు రోజులైనా ఇప్పటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభించకపోవడం చూస్తే అసలు రైతులకు రాయితీ విత్తనం ఇస్తారా లేదా అనే విషయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వర్షం వస్తే నల్లరేగడి భూములు కలిగిన 25 మండలాల్లో పప్పుశనగ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

ప్రత్యామ్నాయమూ లేదు..


ఖరీఫ్‌లో అననుకూల వర్షాలతో పంటల సాగు మందకొడిగా సాగింది. సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చినా... ఇంకా లక్ష ఎకరాల వరకు పొలాలు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఇందులో విత్తుకునేందుకు ప్రత్యామ్నాయం కింద ఇవ్వాల్సిన ఉలవ, జొన్న, కొర్ర లాంటి విత్తనాలు కూడా ఇవ్వకుండా మరిపించేశారు. ఆగస్టు 25న నిర్వహించిన జిల్లాస్థాయి అభివృద్ధి కమిటీ (డీఆర్‌సీ)లో మంత్రి పయ్యావుల కేశవ్ ఖరీఫ్ సాగుపై సమీక్షించారు. 'ప్రత్యామ్నాయం' కింద విత్తనాలు అందిస్తామని ఘనంగా ప్రకటించిన ఆయన చివరకు దాని ఊసే ఎత్తలేదు. కనీసం రబీలోనైనా ముందస్తు సాగుకు వీలుగా విత్తన పప్పుశనగ అందించాల్సి ఉండగా ఇప్పటికీ మొదలు పెట్టలేదంటే రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది.

పట్టించుకునే తీరికేదీ..?

రైతుల కష్టనష్టాల్లో పాలుపంచుకోవాల్సిన చంద్రబాబు సర్కారు వారి గురించి అసలు పట్టించుకోవడమే లేదు. గతంతో పోలిస్తే సగానికి సగం కోత పెట్టి ఈ రబీలో జిల్లాకు 14 వేల క్వింటాళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు కేవలం 500 క్వింటాళ్ల రాయితీ పప్పుశనగ కేటాయించడం దీనికి అద్దం పడుతోంది. సబ్సిడీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి తగ్గించి అదనపు భారం మోపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల 'సూపర్‌సిక్స్‌- సూపర్‌హిట్' అంటూ ప్రభుత్వం భారీ ఎత్తున ఖర్చు చేసి సభ నిర్వహించింది. 'యోగాంధ్ర' కార్యక్రమానికి కూడా నిధులు నీళ్లలా ఖర్చు పెట్టారు. డీఎస్సీలో ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడానికి భారీ మొత్తం వెచ్చించి అమరావతికి పిలిపించుకున్నారు. ఇలా ఆర్భాటాలకు పోయి మంచినీళ్ల ప్రాయంగా ఖజానాను కరిగించేస్తున్న ప్రభుత్వం రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా ఇవ్వకుండా రిక్తహస్తం చూపిస్తుండడం గమనార్హం.

గరుడ వాహన గోవిందా


గరుడ వాహనంపై భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణుడు


మోహిని అవతారంలో స్వామివారు

తాడిపత్రిలో భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

– తాడిపత్రి రూరల్

క్లుప్తంగా

ఖజానా శాఖ డీడీగా రమణయ్య

అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖ డీడీగా జి.రమణయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డీడీగా ఉన్న సరళ విజయకుమారి ఈ ఏడాది జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో వైఎస్సార్ కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అప్పటి నుంచి ఆయన ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా జి.రమణకు పదోన్నతి కల్పించి జిల్లా ఖజానా శాఖ డీడీగా పోస్టింగ్ ఇచ్చారు.

ఏయ్.. బాబూ... ఆటో ర్యాలీకి తీసుకురా..!



ఆటోలను ఆపేందుకు టీ సర్కిల్‌లో వేచి ఉన్న రవాణా శాఖ ప్రాంతీయ అధికారి రమేష్

కళ్యాణదుర్గం: 'ఏయ్...బాబు.. ఆటో పక్కన పెట్టు.. ఏ ఊరు.. ఎక్కడికి వెళ్తున్నావు...'ఆటో డ్రైవర్ల సేవలో' డబ్బులు వస్తున్నాయా.. సరే రాకపోతే మరోసారి వస్తాయి. ముందు ఆటోను ర్యాలీకి తీసుకురా..' అంటూ రవాణా శాఖ ప్రాంతీయ అధికారి రమేష్ ఆటో డ్రైవర్‌లను ప్రాధేయపడటం శనివారం కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో కనిపించింది. వాస్తవానికి ఉదయం స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అనంతపురం రోడ్డు వరకు, అక్కడి నుంచి ప్రజావేదిక వరకు ఆటోలతో ర్యాలీ చేపట్టాలని టీడీపీ నాయకులు ముందస్తు సంకేతాలు పంపారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా 323 మంది మాత్రమే ఈ పథకానికి అర్హులు కావడంతో.. రవాణా శాఖ అధికారులు ర్యాలీకి ఆటోలను తరలించడానికి ఆపసోపాలు పడాల్సి వచ్చింది. కార్యక్రమానికి ఎలాగైనా ఆటోలు అధికంగా ఉండేలా చూడాలని నేతల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు ఇలా తలలు పట్టుకుని అటుగా వెళ్లే ప్రతి ఆటోనూ ర్యాలీకి తరలించాల్సి వచ్చింది.

రైల్లో ప్రయాణికుడి మృతి



మృతుడు ఇస్మాయిల్ సాబ్

గుత్తి: రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న ఇస్మాయిల్ సాబ్ (42) ఆకస్మికంగా మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం సేడంకు చెందిన ఇస్మాయిల్ సాబ్ మూడు రోజుల క్రితం తిరుపతి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని శుక్రవారం సేడమ్‌కు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైల్లోని జనరల్ బోగీలో బయలుదేరాడు. అయితే మార్గ మధ్యంలో ఆకస్మికంగా మృత్యువాత పడ్డాడు. జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు చెప్పారు.

అక్రమ రవాణాకు రథసారథులు

- ఆర్టీసీ బస్సుల్లో మద్యం, నిషేధిత వస్తువుల రవాణా
- ముడుపులు వేసే ఎరకు చిక్కుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్లు
- బస్సుల తనిఖీలను విస్మరించిన ఉన్నతాధికారులు
- తప్పు చేసిన వారిని వెనకేసుకొస్తున్న వైనం



ఆర్టీసీ బస్సులో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)



అనంతపురం క్రైం: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ బస్సుల్లో కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి నిషేధిత వస్తువులు, మద్యం రవాణా అవుతోంది. కొన్ని ముడుపులు ఎరగా వేసే డబ్బుకు లొంగిపోయి కొందరు డ్రైవర్లు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. బెంగళూరు నుంచి ఆర్మీ లిక్కర్ బాటిళ్లను అనంతపురానికి తీసుకొస్తున్న ఆర్టీసీ డ్రైవరును ఎక్సైజ్ అధికారులు కాపుకాచి పట్టుకున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సుల్లో తనిఖీలు పూర్తిగా వదిలేయడం వల్లే అక్రమ రవాణా ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గత సెప్టెంబరు 20న బెంగళూరు రూటుకు వెళ్లే డ్రైవర్ల వ్యవహారంపై 'గాడి తప్పిన ఆర్టీసీ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ రూటుకు వెళ్లాల్సిన డ్రైవర్లు కాకుండా అధికారులను 'బాగా చూసుకునే' వారిని విధులకు పంపుతున్నారని కథనంలో పేర్కొంది. చాలా కాలంగా ఈ వ్యవహారం జరుగుతున్నట్లు ఎక్సైజ్ అధికారుల దాడుల అనంతరం గానీ తెలియరాలేదు.

తప్పు చేసినా.. చర్యలు శూన్యం

ఆర్టీసీలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగుల పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఆర్‌ఎం సుమంత్ ఆదోని ఈ వ్యవహారాల్లో తలదూర్చలేదు. ప్రస్తుతమున్న ఆర్‌ఎం శ్రీలక్ష్మి కూడా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కిందిస్థాయి సిబ్బంది ఆడింది ఆటగా సాగుతోంది. తప్పు చేసిన వారు ఆధారాలతో సహా దొరికినా.. చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులే వారిని రక్షిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అందుకే కిందిస్థాయి సిబ్బంది ఏమాత్రం భయపడకుండా.. అక్రమాలకు పాల్పడుతున్నారు.

నిషేధిత వస్తువులు వస్తున్నాయిలా..

అనంతపురం జిల్లా కేంద్రానికి పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి నిషేధిత వస్తువులను ఎక్కువగా డ్రైవర్లే తీసుకువస్తున్నట్లు తెలిసింది. ఏపీఎస్ ఆర్టీసీతో పాటు కర్ణాటక బస్సుల డ్రైవర్లు కూడా ఈ తరహా రవాణాకు తెగబడుతున్నట్లు పక్కా సమాచారం ఉంది. కాగా నేరుగా కర్ణాటక బస్సుల డ్రైవర్లతో కొన్ని ముఠాలు పార్సిళ్లు తెప్పించుకుంటున్నట్లు నిఘా సంస్థల అధికారులు గుర్తించారు. ఇకపై సాధారణ వాహనాల తరహాలో ఆర్టీసీ బస్సులను కూడా తనిఖీ చేసి పంపాలన్న యోచనలో అధికారులున్నట్లు తెలుస్తోంది.

అధికారుల సేవలో స్క్వాడ్ టీమ్..

ఫలానా అధికారి మనకు వస్తే అనుకూలంగా ఉంటారు.. మనం విధులకు డుమ్మాకొట్టి ఇక్కడే కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉండొచ్చనే వారి సంఖ్య ఈ స్క్వాడ్ టీమ్‌లో అధికంగా ఉందన్న ఆరోపణలున్నాయి. గత ఆర్‌ఎం సమయంలో స్క్వాడ్ టీమ్‌లోని కీలక వ్యక్తులు కార్యాలయం వీడి బయటకు వెళ్లలేదని సహచర ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఉదయం ఆర్‌ఎం ఇంటికి కాయగూరలు మొదలు, అధికారి ఆలయ దర్శనం వరకు అన్నీ దగ్గరుండి చూసుకోవడమే స్క్వాడ్ టీమ్ విధులని యూనియన్ల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రవాణాకు సహకరిస్తున్న డ్రైవర్లపై చర్యలు తీసుకుని, సంస్థ ప్రతిష్టను కాపాడాలని కార్మికులు కోరుతున్నారు.

ఆకతాయికి చెప్పుదెబ్బ

- ధైర్యంగా ఫిర్యాదు చేసిన యువతి



ఆకతాయికి బుద్ధి చెబుతున్న యువతి

అనంతపురం: మద్యం మత్తులో అమ్మాయిలను ఇబ్బందిపెడుతున్న ముగ్గురు ఆకతాయిలను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో హౌసింగ్‌బోర్డులోని ఎస్‌ఆర్ వైన్స్ దగ్గర రోడ్డుపై ముగ్గురు యువకులు పీకలదాకా తాగి హల్‌చల్ చేస్తున్నారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న యువతిని ఓ యువకుడు తాకాడు. దీంతో ఆ అమ్మాయి ధైర్యంగా తిరగబడింది. చెప్పు తీసుకుని చితక్కొట్టింది. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఈవ్‌టీజర్లు అనంతసాగర్ కాలనీకి చెందిన రవికుమార్, వేణుగోపాల్, శివశంకర్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచామని సీఐ శ్రీకాంత్‌యాదవ్ శనివారం తెలిపారు. 14 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. అమ్మాయిలను వేధిస్తే ఎవ్వరికైనా ఇలాంటి గతే పడుతుందని హెచ్చరించారు.

1,009 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అగ్రికల్చర్: కోరమాండల్ కంపెనీ నుంచి 1,009.495 మెట్రిక్ టన్నుల యూరియా శనివారం జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియా నిల్వలను వారు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చినదాంట్లో మార్క్‌ఫెడ్‌కు 520 మెట్రిక్ టన్నులు, మిగతా 489.495 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు, మన గ్రోమోర్‌సెంటర్లకు కేటాయించినట్లు వెల్లడించారు. ఇండెంట్ల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలకు, అలాగే మనగ్రోమోర్, ప్రైవేట్ డీలర్ల నుంచి రిటైల్ దుకాణాలకు సరఫరా చేస్తారని తెలిపారు.

సెల్‌ఫోన్ రిపేరీపై రేపటి నుంచి శిక్షణ

అనంతపురం సెంట్రల్: సెల్‌ఫోన్ రిపేర్ కోర్సుపై నిరుద్యోగులకు ఈ నెల 6 నుంచి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులు శిక్షణాకాలంలో అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం, శిక్షణ అనంతరం టూల్‌కిట్ సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులకు వందశాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎకాలజీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

పామిడి: పి.కొండాపురం రైల్వేగేట్ సమీపాన పెద్దమ్మ గుడి వెనుక శనివారం గుర్తు తెలియని వ్యక్తి (55) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల ఛిద్రమైపోయింది. తెల్ల అంగీ, పంచె, ఎర్ర టవల్ ధరించి ఉన్నాడు. గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో ఘటన



విడపనకల్లు వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం



మృతి చెందిన లావణ్య





కోమాలోకి వెళ్లిన లావణ్య భర్త సుధీర్, కుమారుడు ఉదయ్



చికిత్స పొందుతున్న సంజీవ్‌రెడ్డి

విడపనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయారు. విడపనకల్లు శివారులో శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన సుధీర్ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీలో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. అనంతపురంలో నివాసం ఉంటున్నారు. దసరా పండుగ అనంతరం కుటుంబంతో కలిసి సరదాగా హంపికి వెళ్లాలనుకున్నారు. శనివారం మధ్యాహ్నం అనంతపురం నుంచి సుధీర్ తన భార్య లావణ్య (34), కుమారుడు ఉదయ్‌తో కలిసి శనివారం హంపికి కారులో బయల్దేరాడు. ఇక గోవా నుంచి సంజీవ్‌రెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్యనాయుడు, నాగిరెడ్డి అనంతపురానికి కారులో వస్తున్నారు. విడపనకల్లు శివారులోని పెట్రోలు బంకు సమీపంలో రెండు కార్లు అదుపుతప్పి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జవడంతో లోపల ఉన్న వారంతా కాళ్లు, చేతులు విరిగి కోమాలోకి వెళ్లిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఉరవకొండ సీఐ మహానంది, విడపనకల్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ తమ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కార్లలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను స్థానికుల సహాయంతో అతికష్టం మీద బయటకు తీసి ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో లావణ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం సంజీవ్‌రెడ్డి, పుల్లయ్య నాయుడు, శ్రీనివాసులు, నాగిరెడ్డిలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్యులెక్కడ...?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకువస్తే కంటి వైద్యులు తప్ప మిగిలిన డాక్టర్లు, సూపరింటెండెంట్, సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేరు. పోలీసులు, స్థానికులు, కొంతమంది చారిటబుల్ ట్రస్టు సభ్యులు వైద్యులకు సహాయ సహకారాలు అందించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలోని 50 పడకల ఆస్పత్రిలోనే వైద్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం దారుణమని స్థానికులు వాపోయారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి

విడపనకల్లులో పెట్రోలు బంకు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కెంగూరి ఎర్రిస్వామి, సీపీఎం నాయకులు రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బోయ వెంకటేశులు తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

బుజ్జీ నువ్వులేని జీవితం నాకెందుకు?

- పురుగుమందుబాటిల్‌తో యువకుడి ఆత్మహత్యా యత్నం
- సెల్ఫీ వీడియో అనంతరం సెల్ స్విచాఫ్



పురుగుల మందు బాటిల్‌ను చూపుతున్న పోతులయ్య

రాప్తాడు: ప్రేమించిన అమ్మాయిని దూరం చేసి.. ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో తట్టుకోలేకపోయిన యువకుడు 'బుజ్జీ.. నువ్వు లేని జీవితం నాకెందుకు.. నేను చనిపోతున్నా' అంటూ పురుగుమందు డబ్బా చేతపట్టుకుని సెల్ఫీ తీసుకుని సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన కత్తె లింగమయ్య, మాలమ్మ దంపతుల కుమారుడు కత్తె పోతులయ్య, నార్పల మండలంలోని అమ్మాయిని ప్రేమించాడు. ఇరు కుటుంబాల వారికి చెప్పకుండా నంద్యాల జిల్లా శ్రీశైలంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి వివాహం తమకు ఇష్టం లేదని, మైనార్టీ కూడా తీరలేదని అమ్మాయి తల్లిదండ్రులు నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రేమికులను పట్టుకొచ్చి.. పెద్ద మనుషుల సమక్షంలో ఇద్దరినీ ఎవరిళ్లకు వారిని పంపించేశారు. మైనార్టీ తీరే వరకు దూరంగా ఉండాలని పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో బాలికకు కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలియడంతో పోతులయ్య తట్టుకోలేకపోయాడు. 'నువ్వు లేని జీవితం నాకెందుకు.. బుజ్జీ (ప్రేమించిన అమ్మాయి) నేను చనిపోయిన తర్వాతైనా మన కుటుంబాలను కలుపుతావని అనుకుంటున్నా. నేను చనిపోవాలనుకునే వారందరికీ ధన్యవాదాలు. ఒక వేళ మమ్మల్ని కలిపే ఉద్దేశం ఉంటే బతికించాలని, లేనిపక్షంలో నన్ను వదిలేయండి. మామా నీకు ఎంతో ఇష్టమైన స్థలంలోనే చచ్చిపోతున్నా. కడుపులో చాలా నొప్పిగా ఉంది మామా. నీ కోసం అగ్గి పెట్టె ఒకటే తెచ్చాను. బీడీలు తేలేకపోయాను మామా. బుజ్జీ నేను చచ్చిపోతున్నా.. నువ్వైనా బాగుండాలని కోరుకుంటున్నాను. మా ఊళ్లో చనిపోతే నువ్వు రావని, మీ ఊర్లో వచ్చి చచ్చిపోతున్నాను బుజ్జీ. దయ చేసి నా శవాన్ని మీ ఊర్లోనే పూడ్చి పెట్టాలి. బుజ్జి నా శవం నీ ఒక్కదానికే దొరకాలని కోరుకుంటున్నా. ఈ ప్లేస్ మీరు చూపించిన ప్లేసే. మామ వాళ్లు, వీళ్లు చెప్పిన మాటలు విని పంతానికి పోయావు. ఇదొక్కసారి నా మాట వింటావని కోరుకుంటున్నా. మీ గ్రామంలోనే పురుగులమందు తాగుతున్నా' అంటూ సెల్ఫీ వీడియో తీసి, వారి కుటుంబ సభ్యులకు పంపించిన తర్వాత పోతులయ్య తన సెల్ స్విచాఫ్ చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు అతడి కోసం గాలిస్తున్నారు.

యువకుడి మృతి

అనంతపురం: మతిస్థిమితం లేని ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. బాలుడి తల్లి షేక్ నూర్జహాన్ త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇలియాజ్ (19) పదో తరగతి వరకు చదివాడు. మూడు నెలల క్రితం నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. స్వతహాగా భోజనం, స్నానం చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇలియాజ్ తిరిగి రాలేదు. ఎన్ని చోట్ల వెదికినా కనిపించలేదు. ఎర్రనేల కొట్టాల పక్కన కెనాల్‌లో ఇలియాజ్ మృతి చెందినట్లు బంధువుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కెనాల్ గట్టుపై నుంచి కిందపడినప్పుడు కానీ, దూకినప్పుడు కానీ గాయాలై చనిపోయి ఉండొచ్చని తల్లి నూర్జహాన్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



మృతి చెందిన తజిబుల్

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో విద్యుదాఘాతంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన తజిబుల్ (34) అనే కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్‌లోని మద్యపార గ్రామానికి చెందిన తజిబుల్ పని నిమిత్తం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి వచ్చాడు. అయితే శనివారం సాయంత్రంవిద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా స్తంభంపైకి ఎక్కిన తజిబుల్ షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే స్థానిక సిబ్బంది కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే తజిబుల్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరణ వార్తను కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు కంబదూరు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఒక లైన్‌కు బదులు మరొక లైన్‌కు ఎల్‌సీ ఇవ్వడం వల్లే కార్మికుడు షాక్‌కు గురై చనిపోయినట్లు తెలుస్తోంది.

ఆటోడ్రైవర్లకు చేయూత



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ సేవలో..' పథకం కింద ఆటో డ్రైవర్లకు చేయూత అందించిందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పథకం కింద జిల్లాలో 9,275 మంది డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.13,91,25,000 మంజూరైంది. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును శనివారం బుక్కరాయసముద్రంలో కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జెండా ఊపి ఆటో ర్యాలీతో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు 'ఆటో డ్రైవర్ల సేవలో' పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మాన్, డిస్ట్రిక్ మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్ శ్రీదేవి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం: పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, ప్రొబేషనరీ ఎస్‌ఐల పనితీరుపై శనివారం ఆయన సమీక్షించారు. విధుల్లో ఎలా వ్యవహరించాలో దిశా నిర్దేశం చేశారు. మట్కా, పేకాట, నిషేధిత గుట్కా పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని కోరారు. జిల్లాలో ఫ్యాక్షన్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫీల్డ్ డ్యూటీలకు వెళ్లే స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి, స్పెషల్ పార్టీ పోలీసులకు జత షూస్ చొప్పున ఎస్పీ అందజేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- వెండి, బంగారు ఆభరణాల స్వాధీనం

అనంతపురం: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.22లక్షలు విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ జగదీష్ శనివారం మీడియాకు వెల్లడించారు. శెట్టూరు మండలం మాకోడికి గ్రామానికి చెందిన వి.మర్రిస్వామి అలియాస్ సంగీత, వి.రాజుతో పాటు ముచ్చర్లపల్లి శ్రీనివాసులు పేకాట, తాగుడు తదితర వ్యసనాలకు బానిసలయ్యారు. వీటి కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం దొంగలుగా మారారు. ముగ్గురూ ముఠాగా ఏర్పడి జన సంచారం లేని ప్రదేశాల్లో ఉన్న ఇళ్లను, ఊరి చివరన ఉన్న దేవాలయాలను టార్గెట్ చేసుకున్నారు. తాళాలు పగులగొట్టి విలువైన బంగారు, వెండి ఆభరణాలను, ఇత్తడి, రాగి వస్తువులను అపహరించుకుపోయేవారు. అలా శెట్టూరు మండలం పర్లచేడు తాటి మారెమ్మ దేవాలయం, చింతర్లపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం, కుందుర్పి మండలం బెస్తరపల్లిలో సవారమ్మ దేవాలయం, యర్రగుంటలో మారెమ్మ దేవాలయం, కంబదూరు మండలం కొత్తమిద్దెల పెద్దమ్మ దేవాలయం, రాంపురం మారెమ్మ దేవస్థానం,కొత్తూరు గ్రామం నరసింహస్వామి దేవాలయం, అండేపల్లిలోని వెంకటేశ్వర దేవాలయం, వైసీ పల్లి గౌడ చంద్రమ్మ దేవస్థానం, వైసీ పల్లి కోగరబండ తిప్పమ్మ దేవాలయం, కళ్యాణదుర్గం మండలం కదరంపల్లి పోలేరమ్మ దేవస్థానం, గొల్ల మారెమ్మ దేవాలయం, బోరంపల్లి సుంకులమ్మ, మారెమ్మ దేవాలయాలు, కళ్యాణదుర్గం టౌన్ అక్కమాంబ దేవాలయం, బెళుగుప్ప మండలం యలగలవంక, గౌరసంద్ర మారెమ్మ దేవాలయం, గంగవరం మారెమ్మ దేవస్థానం, గంగవరం- విరుపాపల్లి మధ్యలో ఉన్న సుంకులమ్మ దేవాలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. కళ్యాణదుర్గంలో టౌన్ పార్వతీనగర్, దానంపల్లిలో రెండు ఇళ్లల్లో చోరీ చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో పక్కా సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం రూరల్, యూపీఎస్ సీఐలు నీలకంఠేశ్వర, వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శనివారం ఉదయం కుర్లపల్లి క్రాస్ వద్ద ఈ ముగ్గురి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురూ పాత నేరస్తులు. కర్ణాటకలోని హిరియూర్, అబ్బినహోళ్, చెళ్లికెర పోలీసు స్టేషన్లలో దొంగతనం కేసులు, జిల్లాలోని శెట్టూరు, కళ్యాణదుర్గం రూరల్, యూపీఎస్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇది వరకే లిక్కర్, గ్యాంబ్లింగ్ కేసులు ఉన్నాయి. అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న కళ్యాణదుర్గం రూరల్, యూపీఎస్ సీఐ నీలకంఠేశ్వర, వంశీకృష్ణల బృందాలను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

- బీసీ నేతల పిలుపు



సదస్సులో ఐక్యత చాటుతున్న బీసీ నేతలు

అనంతపురం అర్బన్: హక్కుల సాధన, జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జనగణనలోనే కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాలులో కుల, ప్రజాసంఘాలతో సదస్సు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసరి శంకర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం సలీమ్, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, కురబ సంఘం తరపున మాజీ మేయర్ రాగే పరశురాం, బీసీ సంక్షేమ సంఘం తరపున వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదా గాంధీ, తదితరులు మాట్లాడారు. కులగణన ద్వారానే బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. కర్ణాటక, తెలంగాణ తరహాలో రాష్ట్రంలోనూ కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కులగణన పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబు తమది బీసీల ప్రభుత్వమని జపం చేస్తూనే.. మరోవైపు కులగణన చేపట్టడానికి మాత్రం ముందుకు రావడం లేదన్నారు. కులగణన డిమాండ్‌తో 'చలో అమరావతి' చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సదస్సులో సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, వడ్డెర సంఘం నాయకుడు వడ్డే జయంత్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎస్‌ఆర్ నాగభూషణం, బహుజన సమాజ్ పార్టీ నాయకులు శ్రీరాములు, మైనారిటీ నాయకులు మైనుద్దీన్, నాయకులు సంజీవప్ప, శ్రీరాములు, కేశవరెడ్డి, పద్మావతి, లింగమయ్య, రమణయ్య, రాజేష్, సంతోష్ కుమార్, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామకృష్ణకు సన్మానం



రామకృష్ణను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన కె.రామకృష్ణను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, పూర్వ అధ్యక్షులు అజయ్ కుమార్, ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు, శివయ్య చారి, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ, సుధాకర్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ రంగంలో ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతులు బాగా లేవన్నారు. వైద్య చదువులు ప్రైవేట్ పరం చేస్తున్నారని వాపోయారు. ఉన్నత విద్యను బడుగు బలహీన వర్గాల వారికి దూరం చేస్తున్నారని, ఇలాంటి చర్యలపై సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను మినహాయించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణ స్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి, మిడిల్ క్లాస్ ఉద్యోగుల నాయకులు చెన్నకేశవులు పాల్గొన్నారు.

నేడు స.హ. చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టం -అధికారుల వైఖరి- ప్రజా సంఘాల అభిప్రాయాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని నిర్వాహకులు హొన్నూరప్ప, కేపీ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగే సమావేశంలో అందరూ పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

రసూల్ మరణం సీపీఎంకు తీరనిలోటు

అనంతపురం అర్బన్: సీపీఎం సీనియర్ నాయకుడు టీఎస్ రసూల్ మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. అనారోగ్యంతో రసూల్ శనివారం మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, సీపీఎం నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మాట్లాడారు. ప్రతి కార్యకర్త రసూల్ పోరాటాలను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్,డాక్టర్ ప్రసూన,డాక్టర్ వీరభద్రయ్య, నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు శివారెడ్డి, బాలరంగయ్య, ప్రకాష్, వెంకటనారాయణ, వలి, రాయుడు, రామాంజి పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌లో అంబేడ్కర్‌ను చేర్చారా?

- ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు



అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన ఫొటోలను చూపుతున్న పెన్నోబులేసు, నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కూడా రెడ్‌బుక్‌లో చేర్చినట్లుగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు మండిపడ్డారు. శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో నిప్పుపెట్టడంతో దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన ఫొటోను మీడియాకు చూపించారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను హరిస్తోందన్నారు. ఎమ్మెల్యే థామస్, ఆయన అనుచరుడు సతీష్ నాయుడు ప్రోద్బలంలోనే అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు చౌడప్ప, ఓబులేసు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించని విద్యుత్ ఏఈ

- విధుల్లోనే సస్పెండ్ ఏఈ శివప్రసాద్

రాప్తాడు: మండల విద్యుత్ ఇన్‌చార్జ్ ఏఈగా కూడేరు మండల విద్యుత్ ఏఈ మహమ్మద్ గౌస్‌ను నియమిస్తూ గత నెల 30న ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయినా ఆయన ఇప్పటి వరకు విధులకు హాజరు కాలేదు. దీంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గత నెల 20వ తేదీన హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుదాఘాతానికి గురై పశ్చిమ బెంగాల్ కార్మికుడు షేక్ బషీ మృతి చెందగా.. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఏఈ శివప్రసాద్ నాయుడును సస్పెండ్ చేస్తూ గత నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే కూడేరు మండల విద్యుత్ ఏఈ మహమ్మద్ గౌస్‌ను నియమించారు. అయినా ఆయన ఇంత వరకు బాధ్యతలు చేపట్టక లేదు. మరోవైపు సస్పెండ్ అయిన విద్యుత్ ఏఈ శివప్రసాద్ నాయుడు ఇంకా విధుల్లోనే ఉన్నారు. శుక్రవారం కూడా ఆయన హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గరకు వచ్చి పలువురు రైతులకు విద్యుత్ మెటీరియల్ పంపిణీ చేశారు. దీంతో శివ ప్రసాద్ నాయుడు సస్పెండ్ అయ్యాడో...విధుల్లోనే ఉన్నాడో ఎవరికి అర్థం కావడం లేదు.



మున్సిపల్ కార్యాలయం ముందు ఒకవైపు రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం





ట్రాఫిక్ చక్రబంధనాన్ని దాటే క్రమంలో కిందపడిన ఓ వాహనదారుడు, సప్తగిరి సర్కిల్ ప్రాంతంలో స్తంభించిన ట్రాఫిక్

ప్రయాణికుల మైండ్ 'బ్లాక్'



అవస్థలు పడుతూ రోడ్డు దాటుతున్న మహిళ

శివారు ప్రాంతాలు లేదా కళాశాలల మైదానాల్లో నిర్వహించాల్సిన సభలు, సమావేశాలను నగరం నడిబొడ్డున నిర్వహిస్తుండడంతో ప్రయాణికులకు చుక్కలు కనబడుతున్నాయి. అనంతపురం మున్సిపల్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో శనివారం 'ఆటోడ్రైవర్ల సేవలో' సభ ఏర్పాటు చేసి ఒక వైపు రోడ్డును బ్లాక్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేవలం ఒక వైపు వాహనాలను మళ్లించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, ఆసుపత్రికి వెళ్లే రోగులు, విద్యార్థులు, మహిళలు ట్రాఫిక్‌లో చిక్కుకుని అల్లాడిపోయారు. పాలకులు, అధికారుల తీరుపై పలువురు ప్రయాణికులు మండిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ట్రాఫిక్‌లో ఆగిపోయిన అంబులెన్స్

ప్రమాదంలో ప్రజారోగ్యం

- నగరంలో విచ్చలవిడిగా వెలసిన ప్లాంట్లు
- 'మినరల్' పేరుతో వాటర్ ప్లాంట్ నిర్వాహకుల దందా
- బీఎస్ఐ ప్రమాణాలు పాటించకుండా అమ్మకాలు



నగరంలోని ఓ ప్రాంతంలో ఏర్పాటైన వాటర్ ప్లాంట్

అనంతపురం కార్పొరేషన్: శుద్ధ జలం పేరుతో కొందరు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాలు లేకుండానే నీటిని విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మినరల్ పేరుతో వారు చేస్తున్న వ్యాపారం భవిష్యత్తులో నగర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని నగర పాలక సంస్థ అధికారులు, వైద్య నిపుణులు చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు వాటర్ ప్లాంట్లపై దృష్టి సారిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

300కు పైమాటే..

నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో 300కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నగరంలోని అరవిందనగర్, సాయినగర్, హౌసింగ్ బోర్డు, రామ్‌నగర్, మారుతీనగర్, అశోక్‌నగర్, 1,2,3,4 రోడ్లు, ప్రశాంతి నగర్, ఆజాద్‌నగర్, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్, పాతూరు, రాణినగర్, తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో టర్బిడిటీ, క్లోరిన్, పీహెచ్, టోటల్ డిసాల్వ్ సాలిడ్స్, అల్కలైన్, టోటల్ హార్డ్‌నెస్, సల్ఫేట్స్, మిథైల్ ఆరెంజ్, తదితర ప్రమాణాలు పాటించాల్సి ఉంది. అయితే, ఎక్కడా లవణాలు ఉండాల్సిన మేర లేనట్లు తెలుస్తోంది. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నీటిని శుద్ధి చేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. శుద్ధజలం తయారీలో సరైన ప్రమాణాలు పాటించకపోతే భవిష్యత్తులో దీర్ఘకాలిక సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. కీళ్లు, ఎముకల సమస్య, మలబద్ధకం, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం తదితర సమస్యలు తలెత్తుతాయి.

నమూనాల సేకరణ..

ఇటీవల కొందరు నగరవాసులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి శుద్ధ జలం ప్రజలకందేలా చూడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలతో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి నీటి నమూనాలను సేకరించారు. ఈ క్రమంలో వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిస్తే కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు.

ప్రతి నెలా పరీక్షలు జరగాల్సిందే..

నగరపాలక సంస్థ ద్వారా అందిస్తున్న తాగునీటికి ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. రీజినల్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ, కర్నూలు మెడికల్ కాలేజీకు పంపి పరీశీలనలు జరుపుతున్నారు. అదేవిధంగా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రతి 15 రోజులకోసారి పరీక్షలు చేయించుకోవాలి. కానీ నగరంలో అటువంటి పరిస్థితి కన్పించడం లేదు.



నీటి నమూనాలను సేకరిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో మాబు సుబానీ ఉరుసు



కేశ దర్శనం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం



పవిత్ర కేశ దర్శనం చేసుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్: పది రోజులుగా సందడిగా సాగిన గ్యార్మీ ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. మహిమాన్వితుడిగా పూజలందుకునే దస్తగిరి స్వామి కేశ దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు నగరంలోని శ్రీనివాస నగర్‌లో షాహే గౌసే ఆజం అషార్, పోలీసు లైనులోని మాబుసుబానీ దర్గా తదితర చోట్ల బారులు తీరి స్వామివారి కేశ దర్శనం చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కర్నూలుకు చెందిన హజరత్ సయ్యద్ షా వజ్యూద్దీన్ ఖాదరి, తెహ్రీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా గుసుల్, దువా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దస్తగిరి స్వామి జీవిత చరిత్రలోని ఘట్టాలను వివరించారు. కులమతాలకతీతంగా అందరూ పూజలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఉరుసు ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి దర్గా వారు భోజన వసతి కల్పించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి తదితరులను నిర్వాహకులు సత్కరించారు. వారు మాట్లాడుతూ 16 ఏళ్లుగా దర్గా నిర్వాహకులు చేస్తున్న ఆధ్యాత్మిక కృషిని అభినందించారు. కార్యక్రమంలో షాహె గౌసే ఆజం కమిటీ అధ్యక్షులు షబ్బీర్ అహమ్మద్, సెక్రటరీ నవీద్ ఖాన్, కోశాధికారి అబ్దుల్ సమీ, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

'ఫైర్' డీజీని కలిసిన 'అపుస్మా' నాయకులు



డీజీ వెంకటరమణను సన్మానిస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ వెంకటరమణను శనివారం ఏపీ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డీజీని కలిసిన వారిలో అపుస్మా స్టేట్ కో ఆర్డినేటర్ కుసుమ పుల్లా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ రవిశంకర్ ప్రసాద్, గాజుల చంద్ర, మధుసూదన్‌రెడ్డి, అన్వర్, సుగుణాకర్, రామచంద్రారెడ్డి, రఘునాథ్‌రావు, నారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య

ఆత్మకూరు: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని పంపనూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మహ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిరుధాన్యాలు, కూరగాయలు, గుండ్లు, పండ్లు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ గుళికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పాటలకు కొత్త రూపు తెచ్చారు



కేక్ కట్ చేస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం కల్చరల్: పాత పాటలకు సరికొత్త రూపును తెచ్చి బహుళ ప్రచారం గావిస్తున్న పాత పాటల ప్రేమికుల సమూహం సభ్యుల కృషి ప్రశంసనీయమని డీఆర్‌ఓ మలోల అన్నారు. శనివారం సాయంత్రం పాత పాటల ప్రేమికుల సమూహం 8వ వార్షికోత్సవం మాయకుంట్ల ఓబుళదాసు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఘంటసాల స్మారకమందిరం వద్ద జరిగిన వేడుకలకు డీఆర్‌ఓ మలోల ముఖ్య అతిథిగా విచ్చేసి ఆ పాత మధురగీతాలతో ఘంటసాలకు స్వర నీరాజనమర్పించారు. జీవీ రామయ్య, అనురాధ, ఓబుళదాసు, హరిత, వెంకట్, నవోమి, భాస్కర్, కేశవ తదితరులు పాత పాటలను అద్భుతంగా ఆలపించి ఆకట్టుకున్నారు. అంతకుముందు డీఆర్‌ఓ మాట్లాడుతూ పాత పాటల ప్రేమికుల సమూహం అనంతకే పరిమితం కాకుండా వేలాది మంది సభ్యులతో రాష్ట్రమంతటా విస్తరించడం శుభపరిణామమన్నారు.ప్రసిద్ధి చెందిన గాయనీ గాయకుల జయంతి, వర్ధంతులను నిర్వహిస్తున్న కళాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత అన్నారు.

'లేపాక్షి'లో తగ్గింపు ధరలు



లేపాక్షి ఎంపోరియంలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: జీఎస్టీలో వచ్చిన మార్పులు, క్రయ విక్రయాలపై అవగాహన కలిగి ఉండాలని పలువురు అధికారులన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లేపాక్షి ఎంపోరియంలో జీఎస్టీపై అవగాహన సమావేశం నిర్వహించారు. డీసీటీఓ సుబ్బన్న, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్, చేనేత జౌళిశాఖ ఏడీ వరప్రసాద్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ బసవరాజు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. హస్తకళారుల ఉత్పత్తులపై గణనీయమైన మార్పులతో ధరలుంటాయని, వీటిని అడిగి తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపోరియం ప్రతినిధులు అమరనాథ్, సురేష్ మాట్లాడుతూ కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, రాగి, ఇత్తడి, కంచు వస్తువులు, రోజ్‌వుడ్ ఉత్పత్తులు తదితర వాటిపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతం మాత్రమే ఉంటుందన్నారు. లేపాక్షి హస్తకళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నాగార్జున, వెంకటలక్ష్మి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం

- ఐదు గంటల వరకూ స్పందించని విద్యుత్ అధికారులు



రోడ్డుపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల ఎస్సీ కాలనీలో శనివారం విద్యుత్ స్తంభం విరిగి పడి రోడ్డు మీద పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సోము శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించాడు. ఆ సమయంలో పెద్ద కొమ్మ ఒకటి విద్యుత్ తీగలపై పడడంతో వేప కొమ్మ బరువుకు విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడింది. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ... ఎవరూ అక్కడా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన గురించి విద్యుత్‌శాఖ ఏఈ, లైన్‌మెన్లకు గ్రామస్తులు పదేపదే ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. దీంతో సాయంత్రం వేళ గ్రామ ప్రజలే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి ఫీజులు తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బుక్కచెర్ల గ్రామానికి జేఎల్ఎం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామానికి జేఎల్ఎంను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కమనీయం.. సత్యదేవుని కల్యాణం

అనంతపురం కల్చరల్: చాతుర్మాస దీక్షల్లో భాగంగా సాయిట్రస్టు ఆధ్వర్యంలో శనివారం తపోవనంలోని శివశక్తి సాయి దేవాలయంలో రమా సమేత అన్నవర సత్యనారాయణస్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భాద్రపద శుక్లపక్షంలో వచ్చే ద్వాదశి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు పర్యవేక్షణలో వేదపండితులు కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఎదుర్కోలు, మాంగల్య ధారణ, తలంబ్రాలు, శయనోత్సవం వంటి ఘట్టాలను వేదపండితులు నిర్వహించిన తీరు భక్తిభావం ఉట్టిపడేలా చేసింది. ప్రసాద వితరణ చేశారు. అభిషేకం, విశ్వక్సేన ఆరాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ చాతుర్మాసాల్లోని 8 ద్వాదశిలలో 8 మంది దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రాఘవేంద్ర, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురం టౌన్: విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో 100 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం దాదాపు రూ.20 కోట్ల మేర ఖర్చు చేయనున్నామన్నారు. ఇప్పటికే విద్యుత్ శాఖ ఏడీలు, ఏఈలకు లో ఓల్టేజీ సమస్యలున్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించామని, నగరంలో 75 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 315 కేవీ, 160 కేవీల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరో 25 ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించే పనిలో విద్యుత్ శాఖ అధికారులు నిమగ్నమయ్యారన్నారు. ఈ నెలాఖరులోపు పూర్తి స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 నంబర్‌లో వినియోగదారులు ఫిర్యాదు చేస్తే సకాలంలో పరిష్కారం చూపిస్తామన్నారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇద్దరికి పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. కళ్యాణదుర్గం కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న సి.రామాంజనేయులు, డీఈఓ కార్యాలయం బీ–సెక్షన్‌లో పని చేస్తున్న ఎస్.ఇలియాజ్‌కు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు శనివారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. వీరిద్దరినీ శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి నియమించారు. సుదీర్ఘ కాలం విశేష సేవలందించిన ఇద్దరికీ ఒకేమారు పదోన్నతులు రావడం పట్ల అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయండి



కలెక్టర్ ఆనంద్‌ను కలిసిన మళయాళ సేవా సంఘం ప్రతినిధులు

అనంతపురం అర్బన్: సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ మళయాళ సేవా సంఘం ప్రతినిధులకు సూచించారు. కలెక్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం అధ్యక్షుడు నందకుమార్, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.సంఘం తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రవీణ్, సీఎంసీమణి, శశి, ఎల్ఐసీ సూరి, లాలు, మనోజ్, ప్రజోష్, మమెన్, డీజిల్ మనోజ్, ఘని, మనోహర్, కనకరాజు పాల్గొన్నారు.